క్లుప్తంగా

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుబ్రమణ్యంకు నివాళి



సుబ్రమణ్యం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: మండలంలోని తడుకుపేట గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యులు, ప్రస్తుత నగరి మండల జెడ్పీటీసీ సభ్యుడు గాంధీ తండ్రి, సీనియర్ నాయకులు ఎంపీ సుబ్రమణ్యం అలియాస్ పళని (70) బుధవారం ఉదయం మృతి చెందారు. అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న ఆయన గుండెపోటు రావడంతో కన్నుమూశారు. విషయం తెలిసి మంత్రి ఆర్‌కే రోజా గ్రామానికి చేరుకుని సుబ్రమణ్యం మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు గాంధీ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్రమణ్యం అంతిమ యాత్రకు అధిక సంఖ్యలో జనం హాజరయ్యారు.

సీజేఐకి సాదర వీడ్కోలు



విమానాశ్రయంలో జస్టిస్ చంద్రచూడ్‌కు వీడ్కోలు పలుకుతున్న అధికారులు

రేణిగుంట: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్‌కు బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన అనంతరం ఆయన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోగా, అక్కడ ఆయనకు సుప్రీం కోర్టు రిజిస్ట్రార్ రాకేష్‌కుమార్, అతుల్‌కులకర్ణి, ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణ్‌రావు, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జస్టిస్ భీమ్‌రావు, తిరుపతి 6వ అదనపు జడ్జి జస్టిస్ ఎం.గుర్నాథ్, ప్రోటోకాల్ జడ్జి కోటేశ్వరరావు, ప్రోటోకాల్ ఎస్‌డీసీ భాస్కర్‌నాయుడు, శ్రీకాళహస్తి ఆర్‌డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు సాదర వీడ్కోలు పలికారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సత్యవేడు: శిక్షణలో పొందిన అంశాలు, ఎన్నికల కమిషన్ అందజేసిన నియమావళి పుస్తకాన్ని బాగా చదివి నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. లోక్ సభ, శాసన సభ సాధారణ ఎన్నికలకు సంబంధించి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, అంబేడ్కర్ గురు పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌ను బుధవారం సాయంత్రం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు (డిప్యూటీ కలెక్టర్, ఏపీఐఐసీ తిరుపతి)తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులకు ప లు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు దాసుకుప్పం(278, 279), మదనంబేడు పంచాయతీ (266, 267, 268)లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల్లో బీఎల్‌ఓలు, పీఆర్‌ఓల విధులపై మాక్ పోల్, ఈవీఎం ఆపరేషన్‌పై తీసుకున్న శిక్షణపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల వసతుల వివరాలు తెలుసుకున్నారు. బీఎల్‌ఓలు విధులు, రికార్డుల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్ట్రాంగ్‌రూం గదిలో కిటికీలు, తలుపుల నాణ్యతను పరిశీలించారు. తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, ఎంఈసీ టి.అనిల్ కుమార్, డీటీ రవిచంద్ర, ఆర్ ఐ కిరణ్‌కుమార్, పీఆర్‌ఓలు శేఖర్, సురేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి జగనన్న

- నా బిడ్డను ప్రజాసేవకు అప్పగిస్తున్నాను
- పాదిగుంట గ్రామాన్ని దత్తత తీసుకుంటా
- పేదలకు పెత్తందారులకు మధ్యే ఈ ఎన్నికలు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ డప్పు వాయిద్యాలతో బ్రహ్మరథం పట్టిన ప్రజలు



కృపాలక్ష్మికి క్రేన్‌తో భారీ గజమాల వేసి స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు

గంగాధర నెల్లూరు: పేద ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న గొప్ప నేత సీఎం జగన్ అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం గంగాధర నెల్లూరు మండలం బుక్కాపట్నం, పాచిగుంట పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి

బుక్కాపట్నం, పాచిగుంట, పిచ్చిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎంపీపీ అనిత, బుక్కాపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిపై పూల వర్షం కురిపించి, ఏర్పాటు చేసిన భారీ బాణసంచా, డప్పు వాయిద్యాలతో గ్రామాల్లో మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. చంద్రబాబు ఎస్సీలను మోసం చేసి వెన్నుపోటు పొడుస్తున్నారని, ఎస్సీలంటే చంద్రబాబుకు చులకనని, కల్లబొల్లి మాటలు చెప్పి కుట్రలు చేయడానికి మళ్లీ తయారయ్యారని ఆరోపించారు. దుష్టచతుష్టయంతో, కుట్రదారులతో కూటమి ఏర్పడి సంక్షేమ ప్రభుత్వానికి అడ్డు వస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరెన్ని చేసినా ప్రజలంతా జగన్ వైపే ఉన్నారని తెలిపారు.

మహిళా పక్షపాతి సీఎం జగనన్న..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ మహిళా పక్షపాతి జగనన్న అని, అన్ని రంగాల్లో మహిళలు ముందు ఉండాలన్న ధ్యేయంతోనే అనేక పథకాలను మహిళల పేరిట అమలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం కావాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మరోసారి సీఎంను చేసుకుందామని తెలిపారు. సర్వతో ముఖాభివృద్ధికి ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను దాదాపు 99శాతం నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. నియోజకవర్గంలో తన తండ్రి డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. అదే బాటలో తాను కూడా నడుస్తూ ప్రజా జీవితం సాగిస్తానని అన్నారు. రెడ్డేపల్లి గ్రామ యువనాయకుడు రుద్రా రెడ్డి భారీ క్రేన్ సాయంతో గజమాల వేసి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ లక్ష్మీప్రియ, మండల పార్టీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వేల్కూరు బాబు రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు హరిబాబు, టీబీ, నాయకులు మునిరాజా రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కోదండన్, ప్రభాకర్, వెంకటేష్ రెడ్డి, త్యాగరాజులు రెడ్డి, మోహన్ రెడ్డి, రాజేంద్ర నాయుడు, జయప్రకాష్ రెడ్డి, బుక్కాపట్నం యూత్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





బుక్కాపట్నంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, పిచ్చిరెడ్డిపల్లిలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మికి గజమాలతో స్వాగతం

మంచి జరిగింటేనే జగనన్నకు ఓటెయ్యండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం సాయంత్రం ఆయన పుత్తూరు మున్సిపాలిటీ 8వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ సీఎం జగనన్న నేతృత్వంలో మంత్రి ఆర్‌కే రోజా చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సీఎం అయిన తర్వాత మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలను సంక్షేమ పథకాలతో ఆదుకున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి పనులు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు స్కాముల పేరిట ప్రజాధనాన్ని దోచేసి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మునిరత్నం రెడ్డికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

ఆర్థికసాయం అందజేత..

వడమాలపేట మండలం టీసీ అగ్రహారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మునిరత్నంరెడ్డి బుధవారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మునిరత్నంరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన



పెనుమూరు: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): గ్రామీణ ప్రాంత ప్రజల సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుట్టకిందపల్లి, అంబేడ్కర్‌కాలనీ, ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి ప్రారంభించారు. మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అర్హులైన ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. అవినీతి రహిత, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో ఏవైనా ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ జగనన్న ప్రవేశ పెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని తెలిపారు. సంక్షేమంతో పాటు ఇటు అభివృద్ధికి సీఎం జగనన్న సమ ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగనన్నను మరోసారి నిండు మనసుతో ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జీడీనెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మిని గెలిపించి సీఎం జగనన్నకు కానుకగా ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ క్రమంలో భాగంగా ఇందిరమ్మ కాలనీకి చెందిన మహిళ శ్వేత మాట్లాడుతూ.. ''నేను తన భర్తతో కలసి బతుకుదెరువు కోసం కదిరి నుంచి 16 ఏళ్ల కిందట పెనుమూరుకు వచ్చాం. ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉండే వాళ్లం.. సీఎం జగనన్న పుణ్యమా అని మాకు ఇల్లు మంజూరైంది. నేను ఆసరా పథకం ద్వారా లబ్ధిపొందాను.. నా పిల్లలకు అమ్మఒడి వచ్చింది.. ఇదంతా మా జగనన్న వల్లే.. మేము ఇప్పుడు సంతోషంగా ఉన్నాం.. మా కుటుంబం ఎప్పటికీ జగనన్నకు రుణపడి ఉంటుంది'' అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, నాయకులు యతీశ్వర్ నాయుడు, సురేష్, కృష్ణారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, నీలా పండరీనాథ్, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, మురళి పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి: ప్రతి ఓటరు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ అన్నారు. బుధవారం మెప్మా కార్యాలయంలో ఓటు విలువపై మహిళలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా, నైతికంగా వారి ఓటును వేయాలని కుటుంబ సభ్యులను కూడా ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఓటరు బాధ్యతన్నారు. అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా సమన్వయకర్త వి.బాబా, టీఎంసీ సునీత, మెప్మా సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



నింద్రలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ దీప

నింద్ర: మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎంపీపీ దీప బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేయాలన్నారు. జగనన్న సంక్షేమ పథకాలే మన పార్టీ గెలుపునకు సోపానాలు అన్నారు. మంత్రి రోజా ప్రతి పేదవాడికి అండగా నిలిచిన గొప్ప నాయకురాలు అని కొనియాడారు. పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, సర్పంచ్ బాబురెడ్డి, కోఆప్షన్ సభ్యులు అనిల్, జిల్లా పార్టీ కార్యదర్శి మేరి, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణరెడ్డి, మండల నాయకులు వేణురాజు, రామచంద్రారెడ్డి, మహేష్, రామచంద్రయ్య, చెంచమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి నివాళి



తోఫిక్ అలీ (ఫైల్)



తోఫిక్ అలీ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధర నెల్లూరు: అనారోగ్యం కారణంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తోఫిక్ అలీ (35) మృతి చెందిన సంఘటన ఠాగుండ్రం పంచాయతీ ఆవల కొండ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. తోఫిక్ అలీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వాడని, తన శరీరంపై కూడా సీఎం జగన్ చిత్రపటాన్ని పచ్చ పొడిపించుకున్నాడని స్థానికులు తెలిపారు. తోఫిక్ అలీ మృతి వార్తను తెలుసుకున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఆవలకొండ గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. కుటుంబ సభ్యులను చూసి చలించి పోయిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి తక్షణ సహాయం కింద కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులను అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. మృతిచెందిన తోఫిక్ అలీకి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు ఉన్నాడని గ్రామస్తులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వారి చదువులకు కూడా అన్ని విధాల సహకరిస్తామని ఆదుకుంటామని తెలిపారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన



రైతులకు పరికరాలు అందజేస్తున్న అధికారులు

వెదురుకుప్పం: నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలలో ధర్మాచెరువు, పెరుమాళ్ల పల్లెలకు చెందిన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను సామాజికంగా, ఆర్థిక సాధికారత సాధించేలా సాగు పద్ధతుల పట్ల చైతన్యం తీసుకువస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయంలో అధునాతన పద్ధతులు అవలంబించడం ద్వారా బహుళ ప్రయోజనాలను పొందవచ్చన్నారు. అనంతరం రూ.4.76 లక్షల విలువ చేసే వ్యవసాయ అనుబంధ పరికరాలను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వసుంధర, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూపేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని కోదండరామ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కోదండరామస్వామి ఆలయంలో అన్ని విభాగాధిపతులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 4న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 5న ధ్వజారోహణం, 9న గరుడ సేవ జరుగుతాయన్నారు. ఉగాది పండుగ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. 10న హనుమంత వాహనం, 13న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి





ఆముదాలలో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ పవన్‌కుమార్, సీఐ సత్యబాబు, బలిజకండ్రిగ చెక్‌పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ భారతి

పాలసముద్రం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని డీఎస్పీ పవన్‌కుమార్, సీఐ సత్యబాబు తెలిపారు. ఎస్‌ఐ భారతి పాలసముద్రం పోలీస్ సిబ్బందితో బుధవారం ఆముదాల, పాలసముద్రం పంచాయతీల్లో పర్యటించారు. డీఎస్పీ పవన్‌కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారం నిర్వహిస్తున్న వారి వివరాలను ఆన్‌లైన్ ద్వారా 48 గంటల ముందుగా తెలియజేసి అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రచారంలో పాల్గొనే వాహనాలకు కూడా అనుమతులు లేకపోతే సీజ్ చేయాల్సి వస్తుందని చెప్పారు. సరిహద్దులోని చెక్‌పోస్టుల వద్ద వాహనాలలో భారీగా బహుమతులు తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కవాతు పోలీసుల బలగాలతో గ్రామాల్లో తిరిగారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చక్రవర్తి, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



చివరి రోజు పరీక్షకు హాజరైన టెన్త్ విద్యార్థులు

నగరి: పదో తరగతి పరీక్షలు బుధవారం ముగింపునకు చేరుకున్నారు. ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన పరీక్షలు అంతటా ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 3214 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. పూర్తిస్థాయి భద్రత నడుమ ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా అధికారులు పరీక్షలు నిర్వహించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ప్రశాంతంగా బుధవారంతో ముగిసిందని డిపార్టుమెంట్ ఆఫీసర్ వి.యువరాజ్ తెలిపారు. మండలంలో పాలసముద్రం ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని వసతులు కల్పించడంతో విద్యార్థులు ప్రశాంతంగా రాశారు. ఎస్‌ఐ భారతి తమ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. అందువల్లే ప్రశాంతంగా విద్యార్థులు పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు. చివరిరోజు 164 మంది విద్యార్థులకు గానూ అందరూ హాజరైనట్లు చెప్పారు.